రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నవతెలంగాణ-కొండపాక

స్కూటీని ఆటో ఢీకొట్టడంతో వ్యక్తి మతి చెందిన సంఘటన కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బచ్చన్నపేట గ్రామానికి చెందిన సందెల అశోక్ అనే వ్యక్తి తన స్కూటీపై సిద్దిపేటకు వెళ్తుండగా వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద సిద్దిపేట వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకొని వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. దాంతోఅశోక్ రోడ్డు పై పడి తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టోల్ గేట్ అంబులెన్స్ సిబ్బంది, పోలీసులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుకునూరు పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ వెంచర్లలో హద్దురాళ్ళ తొలగింపు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ, వెలికట్ట శివారులోని అనుమతి లేకుండా చేసిన వెంచర్లలో హద్దు రాళ్ళను అధికారులు శుక్రవారం తొలగించారు. ఎం పీ ఓ వీర రాజు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రాళ్లను తొలగించారు. అనుమతి లేకుండా వెంచర్లు చేయడం చట్ట విరుద్ధమని ఎలాంటి అనుమతి లేకుండా ఉన్న అక్రమ వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయకూడదని వినియోగదారులకు సూచించారు.

సస్పెన్స్ అయిన ఉద్యోగులకు ఊరట

నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన సిద్దిపేట సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు హైకోర్టు మధ్యంతర తీర్పు ఊరటనిచ్చింది. సస్పెండైన 106 మంది ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని శుక్రవారం హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సిద్దిపేట జిల్లాకు చెందిన సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులతో రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో ఈమధ్య సమావేశమయ్యారని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అధికారులకు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే. వారి ఫిర్యాదు మేరకు జిల్లా ఎన్నికల అధికారి 106 మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

కుట్రదారులకు చెంపపెట్టులాంటి తీర్పు : వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట జిల్లాలో 106 మంది ప్రభుత్వ ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించడం, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించడం శుభ పరిణామమని, బీజేపీ అభ్యర్థి రఘునందన్ వంటి రాజకీయ కుట్రదారులకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని మెదక్ బీఆర్ఎస్ పార్ల మెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్వార్థ బుద్ధితో 106 కుటుంబాల్లో దుఃఖం నింపినప్పటికి, ధర్మమే గెలిచిందన్నారు. వాస్త వాలు ఎప్పటికైనా వెలుగు చూస్తాయని, కుట్రలు ఎప్పటికైనా బయట పడతాయని మరోసారి నిర్ధారణ అయ్యిందన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేని బీజేపీ అభ్యర్థి రఘునందన్, ఉద్యోగులను అడ్డం పెట్టుకొని తన మీద రాజకీయ ఎదాడికి పాల్ప డ్డాడని, ఇలాంటి కుట్రలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం తనకుందన్నారు. విజ్ఞులైన ఓటర్లు ఇలాంటి నాయకులకు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు.

పాడైన గుడ్లు పంపిణీ చేయం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌ను సిడిపిఓ జయమ్మ, సూపర్వైజర్ సుజాత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో, పిల్ల ల తల్లులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల కోసం అద్భుతమైన పోషక విలువలు కలిగిన గుడ్లను పంపిణీ చేస్తుందని తెలిపారు. కానీ ఈ మధ్యకాలంలో కొంతమంది వ్యక్తులు అంగన్వాడి సెంటర్‌లో పాడైన గుడ్లు వచ్చాయని వార్త కథనం రాశారని, అదంతా అబద్ధపు ప్రచారమన్నారు. ఎండాకాలం కాబట్టి ఎక్కడో ఒక దగ్గర గుడ్డు పాడైతే పూర్తిగా గుడ్లే బాగా లేదనడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే గుడ్లపై ముద్రలు వేసి ఉంటాయని, కానీ వారు ఎక్కడో పాడైన గుడ్ల ఫోటో పెట్టి పనిగట్టుకుని అంగన్వాడిని బదనా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు అద్భుతంగా నడుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శ్రీమతి, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఆర్‌విఎం ఆసుపత్రికి.. రోగాలు లక్ష్మక్క పల్లి గ్రామానికి



నవతెలంగాణ-ములుగు

ఆదాయం ఆర్విఎం ఆసుపత్రికి రోగాలు లక్ష్మక్క పల్లి గ్రామానికి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఆర్ వి ఎం ఆసుపత్రి యాజమాన్యం. వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన పల్లె లక్ష్మీ నరసింహ మాట్లాడుతూ మండల పరిధిలోని లక్ష్మక్క పల్లి గ్రామం శివారులో ఆర్వీఎం ఆసుపత్రి నిర్మించారు, కానీ ఆసుపత్రికి డ్రైనేజీ మాత్రం నిర్మించుకోలేదు. ఆర్వీయంలో నుండి వచ్చే చెడు నీరు మొత్తం లక్ష్మక్క పల్లి గ్రామ శివారులో ఉన్న చెరువులోకి పంపిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.. గత కరోనా సమయంలో కూడా కరోనాకు సంబంధించిన వ్యర్థం రోడ్డుకు ఇరువైపులా వేయడంతో ఇదేంటని ప్రశ్నించినందుకు తనపై ఆర్ వి ఎం ఆసుపత్రి సిబ్బంది కేసులు కూడా పెట్టారని లక్ష్మీ నరసింహ తెలిపారు. ఇప్పటికి కూడా ఆసుపత్రి నుండి వచ్చే వ్యర్థం నీరు మొత్తం లక్ష్మక్క పల్లి గ్రామ శివారులో గల చెరువులోకి రావడంతో చెరువులో వేసిన చేపలు సైతం చనిపోగా గ్రామంలోకి చెడు వాసన ఎక్కువగా వస్తుందని వాపోయారు. ప్రతిరోజు ఆసుపత్రి నుండి వ్యర్థం రావడంతో గ్రౌండ్ వాటర్ కూడా కలుషితం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఆసుపత్రికి యజమాన్యానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఫలితంగా కేసులు పెడుతున్నారని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా ఆసుపత్రి నుండి వ్యర్థం నీరు మా గ్రామానికి రాకుండా ఆపాలని వారన్నారు. బతుకుతెరువు కొరకు ముదిరాజులు దాంట్లో చేపలు వేసినా కూడా అవి మొత్తం చనిపోయాయని వారు తెలిపారు. ఒకవేళ వారు స్పందించకుంటే ఆర్వీఎం ఆస్పత్రి వద్ద గ్రామస్తులంతా కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు ఈ విషయమై ఆర్వీఎం ఆసుపత్రి సీఈఓ ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు

విద్యతోనే వికాసం.. విజయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

విద్యతోనే వికాసం.. విజయం దక్కుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని మల్లన్న బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాగ్దేవి పాఠశాలను ముఖ్యఅతిథిగా చంద్రారెడ్డి హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల బంగారు భవితకు పాఠశాల యాజమాన్యం బాటలు వేయాలన్నారు. అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు జ్ఞాన సంపాదన అందించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలను ప్రారం భించిన కరస్పాండెంట్ ఉదయ్ భాస్కర్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం నిర్వాహకులు నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, స్థానికులు రమణారెడ్డి, నిర్వాహకులు చంద్ర, పాఠశాల యజమాన్యం పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో చోరీ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

మల్లికార్జున స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామ శివారులో గుట్టపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి రెండు గంటలకు ఆలయంలోకి వెళ్లి మూడు ఉత్సవ విగ్రహాలు, హుండీలో ఉన్న నగదు, సీసీ కెమెరాలు దొంగలించారని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ విజయేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు .

సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి

తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్



నవతెలంగాణ-కొమురవెల్లి

భువనగిరి సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి జహంగీర్ గెలుపుకు కృషి చేస్తామని సీపీఐ(ఎం) పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్ అన్నారు. శుక్రవారం అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి రాంసాగర్ గ్రామం నుండి గ్రామస్తులు కార్యకర్తలతో కలిసి భువనగిరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలు అణగారిన వర్గాలను ఆదుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి, బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి రూ. వేల కోట్ల దండుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

నరేంద్ర మోడీకి గట్టి దెబ్బకొట్టాలి

- కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- పదేండ్లలో తెలంగాణకు బీజేపీ ఏం చేసింది
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి నరేంద్ర మోడీకి గట్టి దెబ్బ కొట్టాలని రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హుస్నాబాద్ మండలంలోని పోతరం ఎస్ గ్రామంలోని శుభం గార్డెన్ లో హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాటాడుతూ.. కరీంనగర్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.పార్లమెంటు ఎన్నికల్లో 7 నియోజకవర్గాల కంటే హుస్నాబాద్ నియోజవర్గం నుండి ఎక్కువ మెజారిటీ వచ్చేలా చూడాలన్నారు.అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. బీజేపీ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి తెలంగాణ కి ఒక విద్యాలయం,వైద్యాలయం , తీసుకురాలేదన్నారు. విభజన హామీలు అమలు చేయలేదన్నారు. తెలంగాణ ఏర్పాటును పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోడీ చనిపోయిన అమరవీరులను అవమానించారన్నారు. ఎంపీగా ఉన్న బండి సంజయ్, గతంలో ఎంపీగా చేసిన వినోద్ కుమార్ ఈ నియోజకవర్గానికి ప్రత్యేకించి ఏం తెచ్చారో చెప్పాలన్నారు. వినోద్ కుమార్ ఈ జిల్లా వాసి కాదని..మన లెక్క కాదని అన్నారు. మన పార్టీ అభ్యర్థి ఎంపిగా గెలిస్తే మానవతావాది రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని, దేశాన్ని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు.

ఆగస్టులో 2 లక్షల రుణమాఫీ చేస్తామని , వచ్చే వర్షాకాలంలో పంటలకు రూ .500 బోనస్ ఇస్తామని రైతులకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ,మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ , ఆరేపల్లె మోహన్ , వెలిచాల రాజేందర్ , హుస్నాబాద్ పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తూరు రవీందర్ చిత్తర పద్మ మండల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి ఐలయ్య ,నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



అకాల వర్షానికి తడిసిన వరిధాన్యం

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంతో పాటు మండలంలోని బస్వాపూర్, ఆరెపల్లి, పోరెడ్డిపల్లితో పాటు పలు గ్రామాలలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి వరిధాన్యం తడిసింది. కాగా ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలడంతో రైతన్నలు బోరున విలపించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యం చేతికందే సమయానికి అకాలవర్షంతో ఇబ్బందులను ఎదుర్కోన్నారు. వరిధాన్యం కొనుగోలు సెంటర్‌లను కొన్ని గ్రామాలలోనె ప్రారంభించారని, మిగతా గ్రామాలలో ప్రారంభించకపోవడంతో సమస్యగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. అలాగే తడిసిన వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేసిన కాంగ్రెస్‌కు..

ఓటుతో గుణపాఠం చెప్పాలి

- ఆటో కార్మికులతో ఫోన్ కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం అంటే నే మోసం... కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కష్టాలు అనే మాటకు నిదర్శనం మన కళ్ళ ముందు ఆటో కార్మికుల జీవితాలు ఆగం అయ్యాయని, కాంగ్రెస్ పార్టీని ఓటుతో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. శుక్రవారం ఆటో కార్మికులతో ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ఆటో కార్మికుల కుటుంబ సభ్యునిగా ప్రతి సంవత్సరం మీకు కొత్త బట్టలు ఇచ్చానని, మీ ఇంట్లో పెళ్లి అయితే ఆటో లక్ష్మి కింద 5వేల రూపాయలు, కార్మికులు చనిపోతే 2లక్షలు రూపాయలు, పిల్లల చదువు కు సహాయం ఇలా ఎన్నో సహాయ సహకారం అందిస్తూ మీలో ఒక కుటుంబ సభ్యునిగా కలిసిపోయినట్లు తెలిపారు. సిద్దిపేట అభివృద్ధి ప్రచారాకులు మీరేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేసిందని, సంవత్సరానికి 12 ఇస్తా అని మాట తప్పిందని, నెలకు 10 వేలు జీవన భృతి ఇవ్వాలని అసెంబ్లీ లో కొట్లాడితే నోరు మెదపలేని ఈ ప్రభుత్వం ను వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఓటు తో బుద్ధి చెప్పాలి అని అన్నారు. రాష్ట్రం లో 40 మంది ఆటో కార్మికులు చనిపోతే ప్రభుత్వం ఆదుకోలేదని, ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యే కూడా పరామర్శించలేదని, పట్టించుకోలేదని, అలాంటి పార్టీ ని ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం సామాన్యులను నడ్డి విరిచిందని, బీజేపీ ప్రభుత్వం 60రూ ఉన్న పెట్రోల్ డీజిల్ ను 100 రూపాయలు చేసిందని, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి, పాలు, పెరుగు, ఉప్పు, పప్పు మీద జీఎస్టీ వేసిందని, సంవత్సరానికి 2కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘనందన్‌రావు దుబ్బాక ఎమ్మెల్యే గా అబద్దాలతో గెలిచాడని, ఎడ్లు నాగలి ఇస్తా అన్నాడని, నిరుద్యోగులకి జీవన భృతి ఇస్తా అన్నాడని, టెక్స్ టైల్ పార్క్ తెస్తా అన్నాడని, ఇలాంటి అబద్దాలు అడి గెలిచి ఒక్క పని చేయాలేదని, ప్రజలని మోసం చేశాడని అన్నారు. మెదక్ బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామ రెడ్డి ని గెలిపించుకోవాలని అన్నారు.

కేసీఆర్ ప్రభుత్వ తప్పిదాలతో భ్రష్టు పట్టిన విద్యావ్యవస్థ

- పిఆర్టియు సంఘ కృషి ఫలితంగా వివిధ సమస్యలు పరిష్కారం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి



నవతెలంగాణ-వర్గల్

కేసీఆర్ ప్రభుత్వ తప్పిదాలు, అనాలోచిత విధానాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వర్గల్ మండలం శాకారంలో జిల్లా అధ్యక్షులు శశిధర శర్మ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి పదవీ విరమణ సన్మాన సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. ఉపాధ్యాయుల వివిధ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తుండగా, కొంత సమయం కావాలని సీఎం రేవంత్ రెడ్డి కోరినట్లు స్పష్టం చేశారు. ప్రతినెల మొదటి తేదీన వేతనాలు సాధించిన ఘనత పిఆర్టియూకే దక్కుతుండగా, త్వరలోనే పెండింగ్ బిల్లులు, బదిలీలు, ప్రమోషన్లు తదితర సమస్యలు పరిష్కారం కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో మిత్రుత్వం కొనసాగిస్తూనే సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని, అయితే పిఆర్టియు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రతి సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తుండడం శుభ పరిణామమన్నారు. ముఖ్యంగా పదవి విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి సంఘ నిర్మాణంలో, సమస్యల పరిష్కారంలో ఎనలేని సేవలందించారన్నారు. అంతేకాకుండా సంఘానికి రక్షణ కవచంలా, సమర్థవంతమైన నాయకత్వం అందించిన ఆయన సేవలు ఎప్పుడు గుర్తుండి పోతాయని స్పష్టం చేశారు. విద్యార్థి నాయకునిగా వికసించి సంఘ నాయకులుగా ఎదిగిన ఆయన నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వర్గాల అభిమానం చూరగొన్నట్లు చెప్పారు. అంతేకాకుండా తన సర్వీసును దీర్ఘకాలంగా ఓకే మండలంలో కొనసాగించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దినట్లు కొనయాడారు. పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వానికి సూచించారు. కింగ్‌లా కాకుండా కింగ్ మేకర్‌గా వ్యవహరించడంలో ఎంతో తృప్తి ఉంటుందని స్పష్టం చేశారు. తోటి ఉపాధ్యాయుల సహకారం, సమిష్టి కృషి ఫలితంగానే జిల్లాలో సంఘాన్ని మరింత పటిష్టం చేయగలిగామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర, జిల్లాల బాధ్యులు జయపాల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కరీముద్దీన్, విజయ, ఇంద్రసేనారెడ్డి, సబ్బని శ్రీనివాస్, వెంకట్రాజం, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక మోడీనీ గద్దె దించుదాం

- రైతు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించాలి
- ప్రతిపక్షాలను బలపరిచి గెలిపించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్



నవతెలంగాణ-సంగారెడ్డి

రైతు, కార్మిక వ్యతిరేక మోడీనీ గద్దె దించుదాం అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల ఆఫీసులో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి టి.సాగర్ హాజరై మాట్లాడుతూ.. రైతు, కూలి, కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం ప్రతిపక్షాలను బలపరచాలన్నారు. గ్రామంలోని రైతులు, కూలీలు, కార్మికులు కార్మిక వ్యతిరేకి మోడీకి గుణపాఠం చెప్పాలన్నారు. మోడీని గద్దె దించితే తప్పా రైతు కూలీ కార్మిక హక్కుల్ని కాపాడుకోలేమన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన పదేండ్ల కాలంలో పూర్తిగా రైతు, కూలీ, కార్మికుల హక్కుల మీద దాడి చేస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నదన్నారు. నల్ల చట్టాలను తెచ్చి రైతులకు మోసం చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కూలీలకు దూరం చేస్తున్నదన్నారు .కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, కూలీలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. మే 13న జరిగే లోకసభ ఎన్నికల్లో మోడీకి గుణపాఠం చెప్పాలని.. కేంద్రంలో రాష్ట్రంలో ప్రతి పక్షాలను బలపరచాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బి. నరసింహ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రత్నం, రఘుపతి, శీను తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి



నవతెలంగాణ-జోగిపేట

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని, ఉద్యోగ సమయంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. పీఆర్టీయూ అందోల్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జోగిపేట ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఆశయ్య పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ పత్రికా సంపాదకవర్గ సభ్యులు ఆకుల మాణయ్య, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గుండు లక్ష్మణ్, సంగారెడ్డి జిల్లా గౌరవా ధ్యక్షులు ప్రభు, జెడ్పీటీసీ అపర్ణ, అందోలు జోగిపేట మున్సిపాల్టీ చైర్మన్ మల్లయ్య, అందోలు జోగిపేట మున్సిపాల్టీ కౌన్సిలర్ శివశంకర్, అందోల్ మండల శాఖ అధ్యక్షులు ఎస్.నరోత్తం కుమార్, మండల ప్రధాన కార్యదర్శి బి.రాజమల్లు, మండల విద్యాధికారి బండి కృష్ణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నరేష్ కుమార్, మురళీకృష్ణ, దేవదాస్, రాష్ట్ర బాధ్యులు మధుసూదన్ వి.విశ్వనాథం, అజిత్ ప్రసాద్, మాంజ్యా నాయక్, యాదయ్య జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అనిల్‌కుమార్, జిల్లా బాధ్యులు సుభాష్, మండల బాధ్యులు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి జహంగీర్‌ను గెలిపించాలి

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
- జహంగీర్ నామినేషన్ కోసం భువనగిరికి భారీగా తరలిన పార్టీ శ్రేణులు



నవతెలంగాణ-చేర్యాల

పేదల పెన్నిధి.. పోరాటల వారధి నిరంతరం ప్రజా సమస్యలు, ప్రజలహక్కుల కోసం నిలబడి పోరాడే భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సిపిఐ(ఎం) అభ్యర్థి యం.డి. జహంగీర్ ను గెలిపించాలని సిపిఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. జహంగీర్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం రోడ్డు షో, బహిరంగ సభకు చేర్యాల మండలం నుండి గ్రామ, గ్రామాన భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు, వామపక్ష ప్రజాతంత్రవాదులు, అన్ని వర్గాల ప్రజలు, మహిళలు భువనగిరి పట్టణానికి వందలాదిగా తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంబించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మహత్తర తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సిపిఐ (ఎం) దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందన్నారు. పేదలు, కష్టజీవుల తరపున నీతి, నిజాయితీతో పోరాడుతున్న సిపిఐ (ఎం) అభ్యర్థి యం.డి. జహంగీర్ గెలుపు నీతి, నిజాయితీ, నిస్వార్థత, నిబద్ధతతో కూడిన గెలుపు కమ్యూనిస్టుల గెలుపు ప్రజా పోరాటాల గెలుపు అని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కరానికి దేశ సమగ్ర అభివద్ధి, ప్రజాస్వామ్య హక్కులు, లౌకిక విలువలు, రాజ్యాంగం పునాదుల పరిరక్షణ, దేశ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టుల అవసరం ప్రస్తుత పరిస్థితులలో ఎంతైనా ఉందన్నారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓట్లు వేసి జహంగీర్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఫార్వడ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య, సిపిఐ (ఎం)పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ళబండి శశిధర్, కాముని గోపాల స్వామి, కొంగరి వెంకట మావో, గొడ్డు బర్ల భాస్కర్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ళబండి నాగరాజు,బండకింది అరుణ్ కుమార్,ముస్త్యాల ప్రభాకర్, రాళ్ళబండి భాస్కర్,ఇప్పకాయల శోభ, ఆముదాల రంజిత్,ఎర్రబోసు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి : ఎంపీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరడం ఖాయమని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల నుండి ఎంపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు భువనగిరికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ సీటు సీపీఐ(ఎం) పార్టీ కైవసం చేసుకుంటుందని తెలిపారు. నోట్ల కట్టలు లిక్కర్ సీసాలతో వస్తున్న పార్టీలకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతినిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల కొరకే తన జీవితాన్ని త్యాగం చేస్తున్న సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థి ఎండి జహంగిర్ ను గెలిపించుకుంటామని నామినేషన్ కార్యక్రమానికి లక్షలాదిగా జనాలు తరలి వచ్చారని తెలిపారు. భువనగిరి కి తరలివచ్చిన అశేష జన వాహినిని చూస్తే జహంగీర్ కు లక్ష మెజారిటీ వస్తుం దన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద, దాసరి ప్రశాంత్, నాయకులు తేలు ఇస్తారి, సార్ల యాదయ్య, ఆరుట్ల రవి, శ్రవణాచారి, చక్రపా ణి, బాలస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తసిక్తమైన ఓఆర్ఆర్..

- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఔటర్ రింగ్ రోడ్డు రక్తసిక్త మయింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు మండలంలోని బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే ఒక కుటుంబం ఇన్నోవా కారులో కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా వెళ్లి తిరిగి హైదరాబాద్ కు వస్తున్నది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని పాటి శివారులో గల ఔటర్ రింగ్ రోడ్డు కొల్లూరు ఎగ్జిట్ నెంబర్ 2 వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఇన్నోవా కారు బలంగా ఢీ కొట్టింది. ఇన్నోవా కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న డ్రైవర్ మహమ్మద్ మునోవర్ (35), అతని పక్కన కూర్చున్న ఫాతిమా బేగం సంఘటన స్థలంలోనే మృతి చెందారు. వెనకాల కూర్చున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రమాద ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తోటపల్లిలో అక్రమ ఇసుక నిల్వల సీజ్



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలను పోలీసులు గుర్తించినట్టు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం తెలిపారు. సుమారు పదిహేను ట్రాక్టర్ల ట్రిప్పుల అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేశామని తహసిల్దార్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలపై తహసిల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు చేపడుతామని తెలిపారు.

మండలంలో విచ్చలవిడిగా ఇసుక నిల్వలు..

అక్రమ ఇసుక రవాణను నివారిచడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన కఠిన చర్యలు చేపడుతున్నా మండల కేంద్రం శివారులోని గుండారం వైపు విచ్చలవిడిగా ఇసుక అక్రమ నిల్వలు దర్శనమిస్తున్నాయి. ఇసుక అక్రమ నిల్వలు, రవాణను అరికట్టడానికి ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ అధికారులను ప్రభుత్వం నియమించింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు విధుల్లో అప్రమత్తతంగా వ్యవహరిస్తూ మండలంలో అక్రమ కార్యకలాపాలకు శాయశక్తుల కృషి చేస్తున్నా మండలంలో ఎక్కడో ఒక చోట ప్రతినిత్యం అక్రమాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. మండల అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే అక్రమ కార్యకలాపాలు ఊతం పోసుకుంటున్నాయని, అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా అధికారులు శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటే ప్రభుత్వంపై విశ్వాసం రెట్టింపవుతుంది.

వివాహానికి హాజరైన మాజీ ఎంపీ సురేష్ షెట్కార్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణానికి చెందిన టబ్లిక్ జమాత్ అధ్యక్షులు మహమ్మద్ ఖైరాత్ అలీ కూతురు వివాహం పట్టణంలోని పటేల్ కళ్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగింది. ఈ వివాహానికి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్‌లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి.. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్ అలీ తాజోద్దీన్, మహమ్మద్ మోతఊజ్, భాస్కర్‌రెడ్డి, బిజీ సందీప్, కిషన్, ఫరూక్, హనుమాన్ జవేద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కట్టుదిట్టంగా నిఘా చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హుసేల్లి సరిహద్దు చెక్‌పోస్ట్‌లో నిరంతరం నిఘా కట్టుదిట్టంగా చేయాలని పోలీస్, రెవెన్యూ వివిధ శాఖల అధికారులకు జహీరాబాద్ ఎన్నికల ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ ఎస్.మోతిలాల్ ఆదేశించారు. హుసేల్లి సరిహద్దు చెక్‌పోస్ట్‌ను రెవెన్యూ, పోలీస్, అధికారులతో కలిసి శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు లోను కాకుండా.. నగదు, మద్యం, తాయిలాలు తరలి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కర్ణాటక - తెలంగాణ సరిహద్దు ప్రాంతం కాబట్టి అధికారుల నిఘా పటిష్టంగా ఉండాలన్నారు. ఆయనతోపాటు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ రాజు, టౌన్ సీఐ రవి, ఎస్సై రామునాయుడు నాయబ్ తహసీల్దార్ రాజిరెడ్డి, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నాయి.



ముగ్గురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు

నవతెలంగాణ-సంగారెడ్డి

పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి రెండో రోజైన శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు రిటర్నింగ్ అధికారి/ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు జాతీయ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరపున సాగర(1) సెట్ నామినేషన్ దాఖలు చేశారు. రెండో రోజైన శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. స్వతంత్ర అభ్యర్థులు బి.మారుతీరావు, కె.ఆనందీశ్వర్, ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు, మహాదేవ్ స్వామి(2) సెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని తెలిపారు. మొదటి, రెండో రోజున కలుపుకుని ఇప్పటివరకు మొత్తం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబందించిన ఆస్తులు, అప్పులు, నేరచరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీసు బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమీషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతున్నదన్నారు. affidavit.eci.gov.in ప్రత్యేక వెబ్‌సైట్‌లో చూడవచ్చు అన్నారు.

శత శాతం పోలింగ్ లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు

- ఓటరు చైతన్య ర్యాలీలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

రానున్న పార్లమెంటే ఎన్నికల్లో శతశాతం పోలింగ్ జరిగేలా ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు అన్నారు. రైతు అవగాహన ర్యాలీలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లా వ్యవసాయ అధికారి నరసింహతో కలిసి, రైతులు ఎడ్ల బండ్ల ర్యాలీని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సంగారెడ్డి పటాన్చెరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, మిగిలిన మూడు నియోజకవర్గాలు ఆందోల్ నారాయణఖేడ్, జహీరాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయ న్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లో శతశాతం పోలింగ్ జరిగేలా వివిధ రకాల ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల 13న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఇందుకోసం బీఎల్‌వోలు స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల సహాయంతో గ్రామాలలో ఓటరు చైతన్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, రైతు సమన్వయ సమితి సభ్యులు,యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తలను కలిసిన నీలం మధు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మద్ది ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ముఖ్య నాయకులను, కార్యకర్తలను మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతీ ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమతో పాటు కలిసి నడవాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పటాన్చెరువు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలానుసరం మండలంలోని నాయకులు, కార్యకర్తల సమావేశం త్వరలో ఏర్పాటు చేసుకుంటామన్నారు.



తూముకుంట కార్యదర్శిని ప్రశంసించిన డీపీఓ

నవతెలంగాణ-జహీరాబాద్

తూముకుంట గ్రామపంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రికార్డుల నమోదు, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను సక్రమంగా నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి బీరప్పను జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా ప్రశంసించారు. జహీరాబాద్ మండలంలోని తుముకుంట గ్రామాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి.. తాగునీరు సరఫరా చేసే ఓహెచ్‌ఆర్ ట్యాంకు, నర్సరీ, డంపుయార్డు, క్రిమిటోరియం, ఎవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతి వనం, గ్రామ పంచాయతీ పారిశుధ్యం, రోడ్లు, మురికి కాలువలు పరిశీలించి సంతృప్తి వ్యకం చేశారు. గ్రామస్తులతో మాట్లాడి పంచాయతీ కార్యదర్శి చేపడుతున్న కార్యక్రమాలు ఏ విధంగా అందుబాటులో ఉన్నాయో ఆరా తీశారు. ఎంపీఓ మహేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీరప్ప, గ్రామ పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు



నీలం మధును గెలిపించుకుంటాం

నవతెలంగాణ-పటాన్‌చెరు

రజకులంతా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజుకు అండగా నిలబడి, పార్లమెంటు ఎన్నికలలో గెలిపించుకుంటా మని సంగారెడ్డి నియోజకవర్గ రజకులు అన్నారు. మండలంలోని చిట్కూల్‌లో గల ఎంపీ అభ్యర్థి క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి నియోజక వర్గంలోని కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలంలోని రజకులంతా నీలం మధు ముదిరాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించి, సంపూర్ణ మద్దతును ప్రకటించారు.బీహెచ్‌ఎల్ మేడ్చల్ రజక సంఘం నాయకులు ఆంజనేయులు, పలువురు రజకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి

- జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్.షీలే

నవతెలంగాణ-సంగారెడ్డి

వచ్చే నెల 13న జరుగనున్న జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు పండగ వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మోతిలాల్ ఎస్. షీలే అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మాధురి, నోడల్ అధికారులు బాలశౌరి, అంజయ్యలతో కలిసి జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అకౌంటింగ్ టీం, వీడియో రికార్డింగ్ టీం, వీడియో సర్వేలైన్స్ టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్వేలెన్సు టీం లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అధికారులకు సూచించారు.



అందరు అధికారులు ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఏఈఓలు వారి రోజు వారి నివేదికలను బిఫోర్టీన్లు మోడల్ ఏఈఓలకు పంపాలన్నారు. ఏటిలు వారి ఎస్ఓఆర్ వివరాలను నోడల్ ఏఈఓ సంగారెడ్డికి పంపించాలన్నారు. అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటి వివరాలను పేపర్ ప్రకటనలు టీవీ ప్రకటనలు తేదీ కన్నా ముందు మూడుసార్లు ప్రచురించాలన్నారు. అభ్యర్థులు వారి ఖర్చుల వివరాలు ఏ,బీ,సీ రిజిస్టర్లలో ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల వ్యయపరిమితి 95 లక్షలకు మించొద్దన్నారు. ఎన్నికలకు ముందు నామినేషన్ సమయంలో సమర్పించిన బ్యాంకు ఖాతా నుంచి ఎన్నికల ఖర్చులు వెచ్చించాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఆయా టీంలు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. షాడో టీం ల ద్వారా ఎప్పటికప్పుడు ఆయా నియోజకవర్గాల్లో వివిధ పార్టీల అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఎన్నికల ఖర్చులు వివరాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే డబ్బుల పంపిణీ మద్యం పంపిణీ పై నిఘా ఏర్పాటు చేసి ఓటర్లను అభ్యర్థుల ప్రలోభాలకు గురి చేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ఆయా టీమ్లకు ఉందన్నారు. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించడానికి ఎన్నికల సంఘం వివిధ రకాల టీమ్లను ఏర్పాటు చేసి అభ్యర్థి ఎన్నికల వ్యయం పరిమితికి మించకుండా ఎన్నికలలో డబ్బులు ఖర్చు చేసేలా చూడాలన్నారు.



సింగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల పరిధిలోని సింగూరు గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 చొప్పున కనీస మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తున్నదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం కనీస సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు సంగమేశ్వర్ గౌడ్, మధుసూదన్, మల్ప వీరారెడ్డి, మల్లేశం, నాగేష్, మొహిన్, విజయ్ కుమార్, ఎల్లయ్య, రైతులు పాల్గొన్నారు

బెల్ట్ షాపుల్లో ఆగని మద్యం అమ్మకాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ బెల్ట్ షాపులో మాత్రం మద్యం అమ్మకాలు ఆగట్లేదు. మండలంలోని చాలా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులను నడిపిస్తూ.. మద్యాన్ని జోరుగా విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టి బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను బంద్ చేయించాలని చెబుతున్నారు.

పనిమంతునికే పట్టం కట్టాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి.. విశేష అనుభవం కలిగిన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి విజయానికి సహకరించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డితో కలిసి పటాన్‌చెరు డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మాదిరి జైపాల్, మాజీ కార్పొరేటర్లు సపాన్ దేవ్, శంకర్ యాదవ్, ప్రతాప్ సేటు తదితరులను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిపాలనారంగంలో ఎంతో అనుభవం ఉన్న వెంకట్రామిరెడ్డి ఎంపీగా గెలిస్తే అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయన్నారు. ఎంపీగానే కాకుండా స్వంతగా రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి యువతీ, యువకులకు కోచింగ్ కేంద్రాలు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి జాబ్ మేళా ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాగే నియోజకవర్గంలో ఒక ఫంక్షన్ హాల్ నిర్మించి శుభకార్యాలకు అందించడం జరుగుతుందన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, 6 గ్యారంటీలు అటకెక్కాయన్నారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. మాయ మాటలు చెప్పేవారిని నమ్మవద్దని, పనిమంతుడైన వెంకట్రామిరెడ్డి కి మద్దతు తెలుపాలన్నారు. లోకల్ నివాసి, తెల్లాపూర్‌కు చెందిన వెంకట్రామిరెడ్డికి ఎన్నికల్లో భారీ మెజారిటీ అందించాలని కోరారు. మాయ మాటలు రావని, మాట తప్పే వాణ్ణి కాదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. పటాన్‌చెరు ప్రాంతంలో ఉన్న సమస్యలపై, వాటి పరిష్కారంపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంటు లో గళమెత్తుతానన్నారు. ఈ ప్రాంత వాసిగా, ప్రజా సేవ కోసం వస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



నూతన డిజైన్లతో ఆకట్టుకోవాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కాలానికి అనుగుణంగా నూతన డిజైన్లతో ఆకట్టుకోవాలని.. తద్వారా స్వయం ఉపాధి పొందాలని బొల్లారం బీజేపీ టౌన్ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో రేణు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గీతాంజలి బోటిక్ షాపును శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఆనంద్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా దిన దినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్వాల్ లక్ష్మి ఆనంద్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుసేల్లి సరిహద్దుల్లో నగదు పట్టివేత

నవతెలంగాణ-న్యాల్‌కల్

హుసేల్లి చెక్‌పోస్ట్ సరిహద్దులో శుక్రవారం చేపట్టిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.1,08,000 నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా హద్నూర్ ఎస్ఐ రాము నాయుడు మాట్లాడుతూ.. పట్టుకున్న నగదును కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు పంపించి సీజ చేసినట్టు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లొద్దని చెప్పారు.

పెద్దరెడ్డిపేట గ్రామస్తులకు పునరావాసం కల్పించాలి

- సింగూరు ప్రాజెక్టులో ముంపునకు గురై.. 45 ఏండ్లవుతున్నా నేటికీ అందని ఇండ్ల స్థలాలు
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం
- ఇప్పటికైనా మాకు న్యాయం చేయండి
- పెద్దరెడ్డిపేట గ్రామస్తుల ఆవేదన

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల పరిధిలోని సింగూరు గ్రామంలో నిర్మించిన ప్రాజెక్టులో సుమారు 40 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు నష్టపరిహారం అందించి పునరావాసం కల్పించారు. కానీ ప్రాజెక్టుకు ఆనుకొని ఉన్న పెద్దరెడ్డిపేట గ్రామంలో కొందరికే పునరావసం కల్పించి దులుపుకున్నారు. దాంతో పునరావసం కింద గ్రామంలో నివసిస్తున్న సుమారు 230 మందిని నేటికీ అటు ప్రభుత్వం గానీ, ఇటు పాలకులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో పంచాయతీ



వద్ద గ్రామస్తులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ గ్రామాన్ని రియాప్టేషన్ గ్రామంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గ్రామాన్ని వేరే చోటకు తరలించేందుకు అప్పట్లో కొన్ని ఎకరాల భూమిని కొనుగోలు చేసి దాన్ని ప్లాట్లుగా మార్చారన్నారు. అయితే ఆ భూమిలో పలుకుబడి ఉన్న వ్యక్తులు, భూస్వాములు.. ఒకటికి బదులు రెండు ప్లాట్లను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. కానీ నిరుపేదలైన తమకు ఇండ్ల స్థలాలివ్వలేదన్నారు. నేటికీ తాము పాత ఊరిలోనే ఇప్పటికీ నివసిస్తున్నామని.. రాత్రి వేళల్లో ఇండ్లల్లోకి విష సర్పాలు, తేళ్ల, అడవి పందులు వచ్చి దాడులు కూడా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లలో నివసించాలంటే ప్రతి ఇంటికి ఒకరు కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేలకు, మంత్రులకు, సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేడని వాపోయారు.

ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక శ్రద్ధ వహించి తమకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే సింగూరు ప్రాజెక్టు నిర్మించారని.. ఇప్పుడు కూడా అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కావున మంత్రి తమను ఆదుకుంటారని నమ్మకం ఉన్నదన్నారు.



పెద్దచెల్మెడలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మునిపల్లి

మార్క్‌ఫెడ్, పెద్దచెల్మెడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారంనాడు మండలంలోని పెద్దచెల్మెడ పీఏసీఎస్ సంఘంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏవో శివకుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్వింటాలు ధర రూ.3180 ఉంటుందని రైతులు దళారులకు నమ్మి అమ్ముకో కుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సంగీత , మహేందర్, రహమాన్, పీఏసీఎస్ కార్యదర్శి శివకుమార్, సిబ్బంది వినోద్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-కోహిర్

మండలంలోని చింతల గట్టు గ్రామంలో మల్లన్న జాతర ఉత్స ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వామి వారికి బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.



ఘనంగా జోగినాథ రథోత్సవ ఊరేగింపు

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలోని శ్రీ జోగినాథ రథోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవ ఊరేగింపు ఘనంగా సాగింది. రంగు రంగుల విద్యుత్ దీపాలు, దేవతామూర్తుల విగ్రహాలతో అందంగా అలంకరించబడిన శ్రీజోగినాథ రథాన్ని రాత్రి 12 గంటలకు ఊరేగించారు. స్థానిక గౌని చౌరస్తా వద్ద రథం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథానికి ఆలయ పూజారులు భద్రప్ప, సుజీత్‌ల నేతృత్వంలో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. రథయాత్రను తిలకించేందుకు చుట్టు ప్రక్క గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గౌని చౌరస్తా నుంచి ప్రారంభమైన రథయాత్ర శ్రీ జోగినాథ దేవాలయం వరకు సాగింది. రథోత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్, సభ్యులు పట్లూరి శివశేఖర్, సురేందర్‌గౌడ్, మల్లయ్య, రంగ సురేష్, కే. నాగరాజు,



చందర్, దుర్గేష్, రవీంద్ర గౌడ్, డీబీ నాగభూషణం, అంబటి రాములు, చింతల సురేష్, పట్లోళ్ల ప్రవీణ్, బ్రహ్మయ్య, ప్రభాకర్‌చారి, సీహెచ్.వెంకటేశం, నర్రానగేష్, చింతకుంట బిక్షపతి, పాటు పలువురు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ జడపల్లి శ్రీధర్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-పటాన్‌చెరు



తక్కువ వోల్టేజ్ అధికశక్తి సమకాలిక బక్ కన్వర్టర్ రూపకల్పన, మోడలింగ్, విశ్లేషణలపై అధ్యయనం చేసి.. సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి జడపల్లి శ్రీధర్‌ను డాక్టరేట్ వరించింది. ఈ పరిశోధనకు మార్గ దర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. వారణాసిలోని ప్రఖ్యాత ఐఐటీ (బీహెచ్‌యూ) ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యుడు ప్రొఫెసర్ మిత్రేష్ కుమార్ వర్మ దీనికి బాహ్య పరిశీలకుడిగా వ్యవహరించినట్టు తెలిపారు. జడపల్లి శ్రీధర్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్-కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు పలువురు ఆయనను అభినందించారు.

నీలం మధు నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా రానున్నారని.. కాబట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ నాయకులు నేడు 7 గంటలకు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ శుక్రవారం పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రామచంద్రపురం పట్టణానికి చెందిన మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు అవినాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అవినాష్ గౌడ్ ఇంటికి వెళ్లిన నీలం మధు ఆయన సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని అవినాష్ గౌడ్‌ని ఈ సందర్భంగా నీలం మధు కోరారు.



రెండోరోజు నాలుగు నామినేషన్లు




నవతెలంగాణ-మెదక్ : లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి పోటీచేసేందుకు శుక్రవారం రెండో రోజు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కౌంటర్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నామినేషన్లను స్వీకరించారు. ప్రజా వెలుగు పార్టీ నుంచి సారా యాదగిరి గౌడ్, స్వతంత్ర అభ్యర్థులుగా బొమ్మల విజయ్ కుమార్, తుమ్మలపల్లి పృథ్వీరాజ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గొల్లపల్లి సాయి గౌడ్ లు నామినేషన్ వేశారు.

సీపీఎం పార్టీ విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం



నవతెలంగాణ-మెదక్

మెదక్ పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో ఈ నెల 20వ తేదిన శనివారం జరిగే సీపీఎం పార్టీ విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మెదక్ టీఎన్జీవో భవనంలో శనివారం ఉదయం 10 గంటలకు సీపీఎం పార్టీ విస్తృత సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్క రాములు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు తప్పకుండా సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సికింద్లాపూర్ ఆలయ హుండీ లెక్కింపు



నవతెలంగాణ-నర్సాపూర్

శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్ శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి దేవాలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శశిధర్ ఆధ్వర్యంలో నాలుగు నెలలకు సంబంధించిన ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ జిల్లా అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ శర్మ, స్వామివారి భక్తుల సమక్షంలో ఆలయ హుండీ లెక్కించగా రూ.3,25,165 ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శశిధర్ తెలిపారు. హుండీ డబ్బులను దేవాలయానికి సంబందించిన బ్యాంకు ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ నర్సింహా రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-నిజాంపేట

మండలకేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. 40%మాత్రమే పంట చేతికి వచ్చిందని..ఇంకా 60% కోతలు కాలేవన్నారు. గన్ని బ్యాగ్ల కొరత లేదన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మాలన్నారు. వడ్లు అమ్మిన మూడు రోజులలోపే రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బాపురెడ్డి, సీఈఓ శోభ రాణి, కంప్యూటర్ ఆపరేటర్ మహిపాల్ రైతులు పాల్గొన్నారు

నీలం మధు నామినేషన్‌కు అధిక సంఖ్యలో తరలిరావాలి



నవతెలంగాణ-వెల్దుర్తి

మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మెదక్ కలెక్టరేట్‌లో శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తెలిపారు శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ రైస్ మిల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా వారు మాట్లాడారు. వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించిన బడా నాయకులు మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురేలేదన్నారు. శనివారం మెదక్ పట్టణంలో నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ , మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ పది కాలాలపాటు కొనసాగాలి

- మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి
- నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బిన్నీ రైస్ మిల్లు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్ మరి కొంతమందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధాన్య లక్ష్మి దయవలన బిన్నీ రైస్ మిల్ పది కాలాలపాటు కొనసాగాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండి రైస్ మిల్కు ధాన్యాన్ని చేరవేసి లబ్ధి పొందాలని చెప్పారు. రైస్ మిల్ యజమానులు రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి అవకాశం కల్పించి ఆదుకోవాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేసి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు పొందాలని సూచించారు. రైస్ మిల్ యజమానులు ఆంజనేయులు, మహేష్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల కోడ్ ఉన్నందున తీర్మాణాలకు బ్రేక్



నవతెలంగాణ- నిజాంపేట

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయ కూడదని ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు వారు చేసిన అభివృద్ధిని గూర్చి సమావేశంలో తెలియజేశారు. సమావేశానికి పలువురు ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీ ఓ రాజేందర్, కరెంట్ ఎఇ గణేష్, మిషన్ భగీరథ ఎ ఇ భిక్షపతి, పంచాయతి ఏఇ సారథి, అగ్రి టెక్నికల్ సతీష్, ఎంఈఓ నీల కంఠం,ధర్మారం డాక్టర్ హరిప్రియ, ఐసిడిఎస్ లక్ష్మి, ఐకెపి సిసి స్వరూప, నందిగామ ఎంపీటీసీ సురేష్ కుమార్ ,నగరం ఎంపీటీసీ లత రవి, ఏపీవో శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్ వినయ్ కుమార్, టెక్నికల్అసిస్టెంట్ శశిరేఖ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, శ్రీధర్, నందిగామ సెక్రెటరీ మహమ్మద్ హరీఫ్ హుస్సేన్, నిజాం పేట సెక్రెటరీ నర్సింలు, నార్లపూర్ సెక్రెటరీ ప్రశాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిన కల్వకుంట నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన బీఆర్.ఎస్ నాయకులు శుక్రవారం మైనంపల్లి హనుమంత రావు, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కల్వకుంట మాజీ పిఎసిఎస్ చైర్మన్ తమన్నా గారి మధుసూదన్ రెడ్డి, చింతలనాగరాజ్, మైనారిటీ అధ్యక్షులు షఫీకు, సంగారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. వంద రోజులలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-నర్సాపూర్

స్నేహితుల వద్దకు వెళ్ళొస్తానని ఇంట్లో నుంచి బయలుదేరి వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో యువకుని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించిన సంఘటన శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిల్లుట్ల గ్రామానికి చెందిన ఎండీ చాంద్ పాషా (42) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని. ఈనెల 11న రంజాన్ పండగ సందర్భంగా తన స్నేహితుల వద్దకు వెళ్ళొస్తానని ఇంట్లో వాళ్లకు చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అప్పటి నుంచి తెలిసిన బంధువుల దగ్గర, స్నేహితుల వద్ద వెతికినా చాంద్ పాషా ఆచూకీ లభించలేదు. అతనికి సంబంధించిన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని చాంద్ పాషా సోదరుడు ఎండీ వాహేద్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

అభ్యర్థుల వ్యయ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్ కుమార్ రాజ్ వాన్సీ



నవతెలంగాణ-మెదక్

ఎన్నికలకు సంబంధించిన ఖర్చుల రికార్డులను పటిష్టంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్ కుమార్ రాజ్ వాన్సీ ఐఆర్ఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ నోడల్ అధికారులు, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టీ, వివిటి టీమ్ సభ్యులు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకుడు మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్ఓ స్థాయిలో ప్రతిరోజు వ్యయ నివేదికలను క్రోడీకరించుకోవాలన్నారు.

అకౌంటింగ్ టీంలు అకౌంట్ వివరాలను నమోదు చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ మెదక్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోద యోగ్యం కాని ప్రతి ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వివిస్టి, వివిటిలు సెగ్మెంట్ల వారిగా నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ద్వారా నిర్వహించు ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటిని వీడియో సర్వేయలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులతో సమన్వయం చేసుకోని షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేసి పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ర్యాలీలు, సమావేశాల ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేయు అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చుల వ్యయ అకౌంట్‌లు, రిజిష్టర్‌లు సక్రమంగా నిర్వహించాలన్నారు. వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చులను నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, ఎన్నికల అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని స్పష్టం చేశారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీం నిర్వహణను పరిశీలించి నిఘా బృందాలు సమర్థంగా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కగా పాటించాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్వో లు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నీలం మధు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బీసీల ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఉంది
- కేంద్రంలో బీజేపీ గ్రాఫ్ తగ్గిపోయింది
- సీఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేయాలి
- మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



బీసీల ఐక్యతను చాటుకోవాలి




నవతెలంగాణ-మెదక్

బీసీ ముద్దు బిడ్డ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులు పేర్కొన్నారు. ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి మెదక్ పట్టణానికి వస్తున్న సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావ్‌లు మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుతో కలిసి స్థభాస్థలంతో పాటు హెలిప్యాడ్ స్థల పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు శనివారం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో మెదక్ పట్టణానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు సీఎం భారీ ర్యాలీగా వచ్చి రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించనున్నారని తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాయకత్వంలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందుకోసం భారీ జనసమీకరణకు నాయకులకు, కార్యకర్తలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. మెదక్ పార్లమెంట్ ప్రసిద్దిగాంచిన నియోజకవర్గం అని, ఇందిరాగాంధీ వంటి మహనీయులు ప్రాతినిధ్యం వహించిన చరిత్ర మెదక్‌కు ఉందన్నారు. నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి, కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేడు జరుగబోయే సీఎం సభ నీలం మధు విజయంపై ప్రభావం ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ బీసీ ముద్దు బిడ్డ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ వేస్తున్న సందర్భంగా మెదక్‌కు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపి ఎన్నికల్లో బీసీల ఐక్యత చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీఆర్, ఇందిరాగాంధీ తప్ప ఆ తరువాత ఇప్పటి వరకు ఏ నాయకులు బీసీలను పట్టించుకున్న నాథులు లేరన్నారు. ముదిరాజ్ కుటుంబ సభ్యుల మెజార్టీ ఎక్కువగా ఉంటుందని, ఈ ఎన్నికల్లో మీ సత్తా చాటుకునే అవసరం ఉందని తెలిపారు. పంచాయతీ సభ్యుడి నుంచి జెడ్పీటీసీ వరకు వచ్చిన సేవాభావం కలిగిన నీలం మధును ఎంపిగా గెలిపించాలని తెలిపారు. సర్వే రిపోర్టులోనూ నీలం మధుకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. రాజకీయం అంటే ఒక వ్యాపారంగా మారిందని, అమాయక ప్రజలను రూ. వెయ్యి, రూ. 2వేలు ఇచ్చి ఓట్లను కొంటున్నారని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుటుంబ పాలన జరిగిందని, 20 ఏళ్ల క్రితం ఏమీ లేని వాళ్ళు కుంభకోణాలతో లక్షల కోట్లకు పడగెత్తారని ఆరోపించారు. రాజరిక పాలన చేసి ఓడిపోయే సరికి మింగుడుపడక ఏది పడితే అది మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్‌లో నాయకులకు గౌరవం దక్కలేదని, నాయకులంతా డిప్రెషన్‌లో ఉండే వారని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేయడం జరుగుతుందని, ఆ తర్వాత కేసీఆర్ అవినీతి చిట్టా విప్పుతామని తెలిపారు. అందరికీ న్యాయం చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కేంద్రంలో బీజేపీ గ్రాఫ్ పడిపోతుందని, దేవుళ్ళతో రాజకీయం చేస్తే మటాష్ అవుతారన్నారు. అన్ని మతాలను కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, కులాలు, మతాలకతీతంగా అందరితో కలిసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇంఛార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్, కౌన్సిలర్లు అవారి శేఖర్, లింగం, నాయకులు జీవన్ రావు, బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి, ప్రశాంత్ రెడ్డి, ఉప్పల రాజేష్, గంగా నరేందర్, సుప్రభాత రావు, మల్లేశం, ప్రభాకర్ రెడ్డి, శంకర్, తాహెర్, హమీద్, ఉన్నారు.

మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్

- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు, కోఆప్షన్ మెంబర్
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-మెదక్

మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఇటీవల మెదక్ మున్సిపల్ ఛైర్మెన్ సహా 11 మంది కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌ను వీడిన పరిస్థితి తెలిసిందే. తాజాగా శుక్రవారం మెదక్ పట్టణ టీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు, మెదక్ చర్చి కార్యదర్శి జి. సామ్సన్ సందీప్ (భానీ), మెదక్ మునిసిపల్ కో ఆప్షన్ మెంబర్ జి. పౌలిన్ సామ్సన్ మంత్రి కొండ సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇదే బాటలో మరికొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ లోకి వలస బాట పడుతుండటంతో పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పౌష్టికాహార కిట్లు అందజేత



నవతెలంగాణ-నర్సాపూర్

సమాజంలో నేటికీ కూడ ఎచ్ఐవీపై ఎన్నో అపోహలు అనుమానాలు ఉన్నాయని. శరీర ద్రవాలతోనే తప్ప ఇతరత్ర కారణాలతో ఎయిడ్స్ వ్యాధి సోకదని ఎపిక్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టీమ్ సభ్యులు విజయ్, జయలు తెలిపారు. శివంపేట మండలంలోని మగ్దుంపూర్ శివారులోని బేతని సంరక్షణాలయంలో శుక్రవారం హెూమ్ పర్ లైఫ్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఎపిక్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఎచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు, మానసిక ఆరోగ్యం సరిగా లేని చిన్నారులకు 17 రకాల పౌష్టికహర కిట్లు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎపిక్ టీమ్ సభ్యులు విజయ్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధి గ్రాస్తులకు సరిచైన పౌష్టికహారం లేకపోవడం వలన బలహీన పడుతున్నారని బాధితులకు ఎపిక్ సంస్థ తరుపున మేమున్నామనే భరోసా కల్పించడంకోసమే పౌష్టికాహర కిట్లను, మందులను పంపిణి చేయడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు సహకారం అందించిన హెూమ్ పర్ లైఫ్ సంస్థకు, సంపూర్ణ సహాయం అందించిన ఎపిక్ సిస్టమ్స్ ఇండియా కంపెనీకి బేతని సంరక్షణాలయం పాదర్ సాజి వర్గీస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతని సంరక్షణాలయం సిస్టర్ కార్మేల్, కోసి, విన్సెంట్, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏ జి ఎం) భాగంగా, ఐ సి ఏ ఆర్-భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ, (ఐ సి ఏ ఆర్-ఐఐఎంఆర్) ప్రతినిధులు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. మండలంలోని కుసంగి రైతు వేదికలో శుక్రవారం "చిరుధాన్యాల ద్వారా పంటల వైవిధ్యం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం చిరుధాన్యాల పై అవగాహన కల్పించడం, ఎఫ్‌పీఓ ద్వారా మండలంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచడమని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో (ఐ సి ఏ ఆర్-ఐఐఎంఆర్) శాస్త్రవేత్తలు డా. సంగప్ప, డా. రఫీ, మెదక్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఏడిఏ, ఎంఏ ఓ, ఎంఏఈఓ, మెదక్ జిల్లా సహకార అధికారులు, మెదక్ జిల్లా నాబార్డ్ అధికారి సిసిల్ తిమొత్తి (డి డి ఎం, సంగరెడ్డి). ఏఈఓ ఇంద్రయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టేక్మాల్ మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ మొగలయ్య, సీఈఓ వెంకటేశం ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. వందమందికి పైగా రైతులు ఈ సమావేశానికి హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఏఈఓ ఇంద్రయ్య కుసంగి గ్రామ పెద్దలు మొగల్ రెడ్డి, యూసుఫ్, కే సంగమేశ్వర్ గౌడ్, ఆర్ అంజయ్య వీరారెడ్డి, మహిపాల్ రెడ్డి, సత్య గౌడ్, రామకృష్ణారెడ్డి, సుభాష్, పి. అనిల్ గౌడ్, ఎ. రాములు, యం.సాయిలు, వై.కృష్ణ, పాల్గొన్నారు.

సినిమా థియేటర్ ల వద్ద అగ్నిమాపక నివారణపై అవగాహన



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల లో భాగంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కుమార్ గజ్వేల్‌లో అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బహుళ అంతస్తుల ప్రదేశాలలో సిబ్బంది, ఉద్యోగులు తప్పనిసరిగా అగ్నిమాపక సాధనాలను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలని చెప్పారు. పట్టణంలో ఎక్కువగా విద్యుత్ లేదా ఎలక్ట్రికల్ ఉపకారణాలవల్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నందున ఐఎస్ఐ మార్కు గల వైర్లు లేదా ఉపకరణాలను ఉపయోగించాలని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో షాపుల్లో విద్యుత్ ఆఫ్ చేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు



నవ తెలంగాణ - కొండపాక : పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు గుణపాఠం తప్పదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ కాంగ్రెస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగారావు అన్నారు. శుక్రవారం కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ అమలు చేసిన ఆరు గ్యారంటీ పథకాలు పేద బడుగు బలహీన వర్గాల వారికి అండగా నిలుస్తున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి పాలనలో ఎలాంటి అభివద్ధి జరగలేదని నిరుద్యోగ సమస్య తీర్చ లేదన్నారు. ఈ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించి తీరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే కార్యక్రమానికి భారీ ఎత్తున తరలిరావాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఏర్పుల మల్లేశం,మల్లికార్జున్, వెంకటరమణ, శ్రీకాంత్ గౌడ్, వెంకటేశం, వెంకట్ గౌడ్, అఖిల్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి గాడిపల్లి భాస్కర్



భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు

నవతెలంగాణ- గజ్వేల్

బిజెపి పార్టీలో ఎమ్మెల్యే ఎన్నికల ముందు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ తన అనుచరులతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు తూముకుంట నర్సారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు అధ్వరంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గజ్వేల్ నియోజకవర్గం సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేతంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో బిజెపి, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం లో రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని వారు తెలిపారు. గాడి పల్లి భాస్కర్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ బలోపేతం అవుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి పార్టీ ఇక్కడ నుండి ఉండదని కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే నియోజకవర్గంలో పటిష్టంగా ఉంటుందని ఆయన చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత గజ్వేల్ ,సిద్దిపేటలో పాగా వేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు చెప్పారు. గజ్వేల్ సిద్దిపేటలో స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరవుతామని వారు చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో మధు గెలిస్తే గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టేలా తాము కృషి చేస్తామని మైనంపల్లి హనుమంతరావు హామీ ఇచ్చారు. గాడి పల్లి భాస్కర్ కాంగ్రెస్లో చేరడం పార్టీకి బలోపేతం అవుతుందని భవిష్యత్తులో ఆయనకు మంచి అవకాశాలు కల్పించేందుకు తమ వంతు కృషిచేస్తామని ఇరువురు మాజీ ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. 2029లో జరిగే శాసనసభ ఎన్నికల్లో గజ్వేల్ నుండి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని వారు చెప్పారు.

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కాబోయే చైర్మన్‌గా భాస్కర్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్గా గాడిపల్లి భాస్కర్‌ను రంగంలో దించబోతున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆయనకు హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనకు సముచిత స్థానం కోసం ముందుగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. రానున్న అన్ని ఎన్నికల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీకి ప్రథమ స్థానంలో ఓటింగ్ ఉండాలని ఈ విషయంలో భాస్కర్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లయితే ఆయనకు అవకాశాలు ముందుకు వస్తాయని వారు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మున్సిపల్ మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, సంతోషిని రామచంద్ర చారి, నిరుడు ఇస్తారని, పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరారు.

నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించాలి



కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పరి నర్సింలు ముదిరాజ్

నవతెలంగాణ - మర్కుక్

బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పనిచేసే మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ను బారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పరి నర్సింలు ముదిరాజ్ కోరారు. శుక్రవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మచ్చలేని నాయకుడు నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలపించాల్సిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ తీసుకుని విస్తృతంగా పని చేయాలని కోరారు.ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు.

పోలీస్ జాగృతి కళా ప్రదర్శన



నవతెలంగాణ-వర్గల్

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, లక్ష్యసాధనతో ముందుకు సాగాలని, వాహనాల డ్రైవింగ్ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి అన్నారు.. మండలంలోని అంబర్ పేట గ్రామంలో గురువారం రాత్రి పోలీసు జాగృతి బృందం కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిరక్షరాస్యత, మూఢనమ్మకాలపై అవగాహన, బాల్య వివాహాల వల్ల నష్టం తదితర అంశాలపై ప్రజలకు కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో గౌరారం ఎస్సై శివకుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

నవవధువుకు పుస్తే మట్టెలు అందజేత



మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన దుబ్బాసి మల్లమ్మ-యాదవ్వ, మల్లయ్య కూతురు మహేశ్వరి వివాహానికి పుస్తే మట్టెలను మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్,శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పెళ్ళి కూతురు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రోల్ల నర్సింలు, దుబ్బాసి బాలయ్య, మల్లయ్య, బాలకృష్ణ, బిక్షపతి, స్వామి, నర్సింలు, నర్సయ్య, బాబు, చంద్రయ్య, తదితరులున్నారు.

ఘనంగా శ్రీ రంగనాయకుల స్వామి రథోత్సవం



నవతెలంగాణ - జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రములో గల శ్రీ రంగ నాయకుల స్వామి వారి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.గ్రామంలోని అన్ని విధుల్లో రథయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రదయాత్రను విజయవంతం చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రఘు పంతులు,భక్తులు మారుతి వెంకట్ నరసింహా రెడ్డి, మన్నే ప్రకాష్,రవి మన్నే వారి కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళ గురుకులంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బా పూలే మహిళ డిగ్రీ కళాశాల వార్షిక దినోత్సవ సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలలో మహిళ గురుకులానికి చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ క్రీడాకు సంబంధించిన పూర్తి సామగ్రిని కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రావు విద్యార్థులకు అందజేసి మొదటి రోజు విద్యార్థులతో కలిసి ఫ్రెండ్లీ మ్యాచ్ లో పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి వార్షిక దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీడీఎం లోకేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ గోవిందా రావు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు నగటి ఎద్దు మృతి



నవతెలంగాణ -జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో శుక్రవారం పిడిగుపాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చాట్లపల్లి గ్రామానికి చెందిన భూమల్ల కొండయ్యకు గల నగటి ఎద్దు పిడుగు పాటుకు అక్కడికక్కడే మృతి చెందింది.రోజు మాదిరిగానే తన ఎద్దును బావి దగ్గర ఉంచగా మధ్యాహ్నం సమయంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు 80 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవ తెలంగాణ- దుబ్బాక

కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం దుబ్బాక మండల పరిధిలోని సిఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.అనంతరం చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి పలువురు కాంగ్రెస్ నాయకులు చిత్రపటాలను బహుమతిగా ఇచ్చి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, ఎ.శ్రీనివాస్,కొంగర రవి,కడుదూరి నరేందర్ రెడ్డి,నర్మేట యేసురెడ్డి,ఉషయ్యగారి రాజిరెడ్డి,చెరుకు అమర్ రెడ్డి,మంద శ్రీనివాస్,శ్రీరామ్ నరేందర్,మాజీ సర్పంచ్లు జనార్దన్ రెడ్డి,రాజిరెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేసవి పనులపై వైద్యాధికారులు ఆరా



డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్

నవ తెలంగాణ- గజ్వేల్

ఉపాధి హామీ కూలీల పనులు చేస్తున్న ప్రదేశాలను శుక్రవారం ఆకస్మికంగా గజ్వేల్ మండల పరిధిలోని అక్కర గ్రామంలో గజ్వేల్ డిప్యూటీ డాక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం జాతీయ ఉపాధి హామీ కూలీలతో డాక్టర్ శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఎండలో వడ దెబ్బ తాకే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఉదయం 11 లోపు పనులు చేసుకోవాలని, పనులకు వెళ్లే ముందు ఇంటి నుండి మంచినీటిని తీసుకొని పోవాలని సూచించారు. శుభ్రమైన నీటిని తాగాలని ఎండలో ఎక్కువసేపు ఉండొద్దని ఎవరికైనా కండ్లు తిరిగి చెమటలు పట్టడం శ్వాస ఆడకపోవడం లాంటి సమస్యలు ఎప్పుడైతే కనిపిస్తాయో వారికి వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలని కృత్రిమ శ్వాస అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ స్పెషల్ ఆఫీసర్ షేక్ అరీఫా.శ్రీగిరి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్.. శ్రీనివాస్ సబ్ యూనిట్ ఆఫీసర్ గజ్వేల్ శ్రీదేవి, నాగమణి ఆశ వర్కర్ , లేజ్ సెక్రటరీ నాగరాజు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి



సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ

నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలు అభివీద్ధి చెందుతారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గౌడ కుల సంఘం సభ్యులు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన వెంటనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాబోయే రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు అందేలా చూస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్, భాజపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, మండల నాయకులు గుర్రం అంజిరెడ్డి, గ్రామ అధ్యక్షులు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, కొడారి మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, గౌడ సంఘ సభ్యులు, కిషన్, అంజయ్య, సురేందర్, మోహన్, శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వరికి బోనస్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డ్



నవతెలంగాణ -నంగునూరు

వరి పంటకు 500 బోనస్ ఇవ్వాలని శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డ్ ద్వారా వినూత్న నిరసన తెలిపారు.నంగునూరు మండలం గట్ల మల్యాల, రాజగోపాల్ పేట గ్రామాల్లోని రైతులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నంగునూరు మండల బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డిలు మాట్లాడుతూ రైతు బంధు డబ్బులు అందరికీ ఇవ్వాలని, రుణమాఫీ వెంటనే ప్రకటించాలని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.సోసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్ తాజా, మాజీ సర్పంచ్ కమలాకర్ రెడ్డి,రంగు రాజు గౌడ్, మల్లేశం, రైతులు తదితరులు హాజరయ్యారు.

పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాలను లెక్కించాలి



మెదక్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు సునీల్ కుమార్ రాజ్వన్షీ

నవ తెలంగాణ -సిద్దిపేట కలెక్టరేట్

లోక్ సభ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాలను పగడ్బందీగా లెక్కించాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్ కుమార్ రాజ్వన్షీ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం. ఎక్సైజ్ , ఇన్‌కమ్ టాక్స్ అధికారులు, ఎన్నికల అధికారులు, పరిశీలకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలెన్సు, ఎస్ఎస్‌టి తదితర నిఘా బృందాల ద్వారా సీజ్ చేసిన అక్రమ నగదు, లిక్కర్ రవాణా వివరాల గురించి సునీల్ కుమార్ రాజ్వన్షీ అడిగి తెలుసుకున్నారు. లోక్సభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా కృషి చేయాలని అన్నారు. ఎద్యం, లిక్కర్ ప్రభావం చూపకుండా చూడాలని అన్నారు. రిర్డులను పరిశీలించి అక్రమంగా తరలించే మద్యం, మనీ గుర్తించి సీజ్ చేసేలా చూడాలని అన్నారు. అదేవిధంగా వీడియో సర్వేలను టీం లో ద్వారా సేకరించిన ఎన్నికల ర్యాలీలు, సభలు సమావేశాల పరిశీలించి ఉపయోగించిన వస్తువులను వీడియో యు వింగ్ టీం ద్వారా గుర్తించి ఎలక్షన్ కమిషన్ రేట్ చార్ట్ ప్రకారం అభ్యర్థుల ఖాతాలో వ్యయాన్ని నమోదు చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎం .మనుచౌదరి, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమ అగ్రవాల్, శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సూపర్ ఇంటింటెంట్ శ్రీనివాస్ మూర్తి, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు, డిపిఆర్ఓ రవికుమార్, సమాచార శాఖ డీఈ తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమయంలో చేసిన సేవలే గుర్తింపు తెస్తాయి



తెలంగాణ - కొండపాక

ఉద్యమ సమయంలో అంకితభావంతో చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆఫీసు సబార్డినేట్ బాలపోచయ్య ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది సహజమని, ఉద్యోగికి విరమణ తప్పదని కానీ ఉద్యోగంలో ఉన్న సమయంలో చేసిన పనులు సేవలు ఎప్పటికీ గుర్తింపు తెస్తాయన్నారు. బాల పోచయ్య దంపతులను ఎమ్మెల్సీ సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇంద్రసేనారెడ్డి, రామస్వామి, శ్రీనివాస్ రెడ్డి, రఘు రాములు, ఆయ పాఠశాలల ఉపాధ్యాయులు, పదవి విరమణ పొందిన బాల పోచయ్య బంధువులు పాల్గొన్నారు.

భువనగిరి తరలి వెళ్లిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-మద్దూరు

భువనగిరి సీపీఐ(ఎం) పార్టీ ఎంపీ అభ్యర్థి ఎండి జహంగీర్, నామినేషన్ సందర్భంగా మద్దూరు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్ ల ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరికి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ(ఎం) అభ్యర్థిని భువనగిరి ఎంపీగా ప్రజలు గెలిపించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్ళడం ఖాయం



కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

బైక్ ర్యాలీ, రోడ్డు షోలో రఘునందన్ రావు

నవతెలంగాణ -నంగునూరు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అవినీతికి పాల్పడిన మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు తెలిపారు.శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అక్కడి నుండి భాషా గూడెం,తిమ్మాయిపల్లి, నర్మెట, నంగునూరు మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు.నంగునూరులో రోడ్డు షోలో రఘునందన్ రావు పాల్గొన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రఘునందన్ రావు మాట్లాడుతూ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సైతం జైలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్ళు నంగునూరు మండలం వాగవతలి గ్రామాలకు చుక్క నీరు అందించ లేదన్నారు. ఎన్నికల్లో అమలు కాని హామీలిచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని అన్నారు.లంకె బిందెలు ఉన్నాయని అంటూ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ లంకె బిందెలు హరీష్ రావు ఎత్తు కెళ్ళాడంటూ మాట్లాడుతున్నాడని అవహేళన చేశాడు. పొట్టోని నెత్తిన పొడుగోడు కొడితే పొడుగోని నెత్తిన పోశమ్మ తల్లి కొట్టాలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి,ఉపాధ్యక్షులు పేరాల తిరుపతి రావు,వాసర యాదమల్లు,కోల సతీష్ గౌడ్,రజినీకర్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, మల్యాల రాజు, సురేందర్ రెడ్డి బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు హాజరైనారు.

హైకోర్టు ఉత్తర్వులతో అధికారుల్లో ఆనందం


నవతెలంగాణ-మర్కుక్ : ఎన్నికల ప్రవర్తన నయమావళిని ఉల్లంఘిస్తూ ఓ రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న 106 మంది ఉద్యోగులపై వేటు వేస్తూ ఇటీవల జిల్లా పరిపాలనాధికారి మిక్కిలినేని మనుచౌదరి ఉత్తర్వులు జారీ చేసిన విషయంలో వేటు వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ సస్పెన్షన్ చేసిన అధికారులను విధులలోకి చేర్చుకోవాలని సూచించడంతో మర్కుక్ మండల ఈజీఎస్ ఈసీ రాజు, సీవో రాజు, టీఏలు సురేష్, నరేష్, ఐకెపి ఎపిఎం కిరణ్, రమేష్‌లు సంతోషం వ్యక్తం చేశారు.

స్పందించిన సైనిక్ స్కూల్ యజమాన్యం

నవతెలంగాణ-ములుగు

సైనిక్ స్కూల్‌కు పర్మిషన్ లేదు అనే శీర్షికతో ఈనెల 18వ తేదిన నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి 19వ తేదిన సైనిక్ స్కూల్ కరస్పాండెంట్ స్పందించారు. సైనిక్ స్కూల్‌కి ఇప్పటివరకు పర్మిషన్ లేదని ఈ నెలాఖరులోగా స్టేట్ పర్మిషన్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నవ తెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించి స్కూల్‌కి నోటీసు ఇచ్చామని, త్వరలో రిజిస్ట్రేషన్ పత్రాలు ఇస్తామని తెలిపారని అని నవతెలంగాణతో తెలిపారు

నేడు శ్రీరామనవమి వార్షిక పంచాహ్నిక కల్యాణ వేడుకలు



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రం లోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం లో శనివారం శ్రీరామ నవమి వార్షిక పంచాహ్నిక కళ్యాణ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ కోహెడ ప్రసాదరావుశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం బండ్లు తిరగడం, జాతర ఉత్సవం జరుగుతుందన్నారు. అలాగే స్వామివారి ఆలయం నుంచి హైస్కూల్ వరకు పల్లకిలో భజనలు కోలాటంలతో స్వామివారి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీరాములపల్లి భజన మండలి వారిచే భజన కార్యక్రమాలు జరపనున్నామన్నారు. శోభాయాత్ర అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కమనీయం..నృసింహుని కల్యాణోత్సవం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ఏకశిల గుట్టపై ఆలయ అవరణం వద్ద లక్ష్మి నృసింహుని తిరు కల్యాణోత్సవ ఘట్టం ఆలయాధి కారులు కమనీయంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ ఈఓ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఏకశిల గుట్టపై కల్యాణోత్సవంలో భక్తుల గోవిందా నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఉత్సవాల్లో మొదటి ఘట్టం లక్ష్మినరసింహ స్వామి తిరుకల్యాణోత్సవాన్ని అర్చకులు వేద మంత్రాలలో కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై లక్ష్మి నరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఎంపీపీ లింగాల నిర్మల, ఎంపీటీసీ గుభిరే శారధ, మాజీ సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, అర్చకులు, గ్రామంలోని మహిళలు హాజరయ్యారు.

బీజేపీలో చేరిన న్యాయవాది



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాల్ పేటకు చెందిన న్యాయవాది తత్తరి స్వామి మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు సమక్షంలో బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, న్యాయవాదులు తుంగ కనకయ్య, సదానందం, శనిగరం నవీన్ కుమార్, రాజగోపాల్ పేట గ్రామ బీజేపీ నాయకులు గౌరబోయిన రమేష్, సయ్యద్ రమేష్ పాల్గొన్నారు.

రఘునందన్‌కు న్యాయవాదుల సన్మానం

నవ తెలంగాణ - సిద్దిపేట : మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మీ సహకారం అందించాలని మెదక్ బిజెపి పార్లమెంటు అభ్యర్థి రఘునందన్ రావు అడ్వకేట్స్ ను కోరారు. శుక్రవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ లో న్యాయవాదులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది హరిచంద్ర, తుంగ కనకయ్య, లీగల్ సెల్ కన్వీనర్ సదానందం, నవీన్, స్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెదక్ గడ్డ కాంగ్రెస్ అడ్డ



పీసీసీ అధికార ప్రతినిధి బందారు శ్రీకాంత్ రావు

నవతెలంగాణ- గజ్వేల్

మెదక్ పార్లమెంటు గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మెదక్ పార్లమెంటు ఎన్నికల ఇంచార్జి బందారు శ్రీకాంత్ రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును అఖండ మెజారిటీ తో గెలిపించే బాధ్యత మన భుజాలపై ఉందని ప్రతి కార్యకర్త నిర్విరామంగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. రేపటి నామినేషన్ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటానని అందరూ కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిగుల్ మాజీ సర్పంచ్ కప్పురా భాను ప్రకాష్‌రావు, ఎస్సీ సెల్ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపక విజయ కుమార్, మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి రాచకొండ ప్రశాంత్, ఐ ఎన్ టి యు సి అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్, మార్కుక్, కొండపాక మండల కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రవణ్ రెడ్డి పార్శ్వారములు మండల నాయకులు రవి, ఎన్జి ఎస్ యు ఐల్లా ప్రధాన కార్యదర్శి రవి కపిల్ కార్యదర్శి భాను వివిధ గ్రామలా పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయానికి కృషి



నవతెలంగాణ- గజ్వేల్

మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయానికి కృషి చేస్తానని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో .. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేతి గుర్తుకు ఓటు వేసి నీలం మధును గెలిపించాలని ఆయన కోరారు.





ఎర్ర జెండా అడ్డా..భువనగిరి గడ్డ

- కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ నామినేషన్ దాఖలు







నవతెలంగాణ-భువనగిరి

తెలంగాణ సాయుధ విప్లవ రైతాంగ పోరాటం జరిగిన పోరాటాల ఎర్రజెండా అడ్డా భువనగిరి గడ్డ అని, వారసత్వం పుణికిపుచ్చుకున్న భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను ప్రజలు గెలిపించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ(ఎం) అభ్యర్థి నామినేషన్ అనంతరం భువనగిరి ఏఆర్ గార్డెన్లో నిర్వహించిన సభలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అనేక పోరాటాలు నిర్వహించిన సీపీఐ(ఎం) చరిత్రను సీపీఐ(ఎం) పార్టీపై పోటీ చేసిన జహంగీర్ చరిత్రను, ఇతర పార్టీల, వ్యక్తుల చరిత్రను తెలుసుకొని అర్హులైన వారికే ఓటు వేయాలని కోరారు. గెలుపునకు మీరందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు .సీపీఐ(ఎం) గెలిస్తే ప్రజల హక్కులుతో పాటూ వారి సమస్యలు పరిష్కారమవుతాయని, పూర్వవైభవం భువనగిరికి వస్తుందని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం)ను గెలిపించండి ..మతోన్మాద రాజకీయాలను ఓడించండి :సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి. జహంగీర్



తెలంగాణలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) సుత్తకోడం నక్షత్రం పై ఓటు వేసి గెలిపించి మతోన్మాదులకు బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో అవకాశవాద రాజకీయాలు, మతోన్మాద రాజకీయాలు ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వామపక్ష భావజాలం ఉన్న సీపీఐ(ఎం) మరోవైపు నిలబడి ఎన్నికల బరిలోకి దిగామన్నారు. ప్రజలు గ్రహించి సీపీఐ(ఎం)ను ఆదరించి మతోన్మాదులను తరిమికొట్టాలన్నారు. గ్రామ గ్రామాన కమ్యూనిస్టుల ఎర్రజెండాలు రెపరెపల ఆడాలని కోరారు. 2008లో నుండి ఏర్పడ్డ భువనగిరి నియోజకవర్గంలో కోమటిరెడ్డి బ్రదర్‌లు రెండుమార్లు బూర నర్సయ్య గౌడ్ మరోమారు పోటీ చేసి గెలిచారన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి దూరమైందని తెలిపారు. ప్రజలకు సేవ చేసే ఈ పదవులను వారు విలాసాలకు వాడుకున్నారని తెలిపారు. బస్వాపురం ప్రాజెక్టు, గంధ మల్ల ప్రాజెక్టు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తికాలేదన్నారు .భువనగిరిలో సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. హైదరాబాదు నుండి భువనగిరికి నీరు కొనుకునే పరిస్థితి ఉందన్నారు. ఉపాధి ,పరిశ్రమలు మౌలిక రంగాల్లో అత్యంత వెనుకబడ్డ పార్లమెంటు నియోజకవర్గం అని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో వైఫల్యం చెందామని బూర నర్సయ్య గౌడ్ తెలిపారని వివరించారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు బీజేపీని తిరస్కరిస్తున్నారని తెలిపారు. బీజేపీ ఆటలు సాగవని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ప్రజా ఉద్యమాలు వారి పాత్ర ఏందని ప్రశ్నించారు. కేవలం డబ్బులు ఉండడమే వారికి అర్హత అని ఎద్దేవా చేశారు .ప్రజా సమస్యల పరిష్కారం కోసం లాఠీ దెబ్బలు తిన్నామని అనేక పోరాటాలు చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్టు తెలిపారు . సీపీఐ(ఎం)కు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్ వైద్యశాలలో 48 విభాగాలు ఉండగా 24 విభాగాలు మాత్రమే పనిచేస్తున్నాయని ఇది బీజేపీ చేతకానితనం కాదా అని ప్రశ్నించారు. సీపీఐ(ఎం)ను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

దేశ భవిష్యత్తు ప్రజల భవిష్యత్తు రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జూలకంటి రంగారెడ్డి



దేశ భవిష్యత్తు, ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికల్లో ప్రాముఖ్యత దాగి ఉందని ప్రజలు ఓటును సద్వినియోగం చేసుకొని సీపీఐ(ఎం) గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గాసభ్యులు జూలకంటి రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. పోరాటాల చరిత్ర ఉన్న ఈ ప్రాంతం పేదలకు లక్షలాది ఎకరాలు పంపిణీ చేసిందన్నారు. వెట్టిచాకిరి విముక్తి సంఘాల ఏర్పాటు చేసిందన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు కలిసి రావాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ ఉన్నతమైన ఆశయాలతో వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఆశయ సాధన కోసం సీపీఐ(ఎం) పనిచేస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాత్ర ఈ పోరాటాల్లో లేదని పేర్కొన్నారు. కనీసం ప్రజల కోసం చేసే పోరాటాల్లో కూడా వారు లేరని తెలిపారు. మతము కులము ప్రాంతం అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేసేవారని విమర్శించారు. ప్రజలు తలుచుకుంటే ఈ పోరాటాల గడ్డలో పెట్టుబడి దార్ల చేతుల్లో బందీ అయిన పార్టీలకు బుద్ధి చెప్పడం సాధ్యమేనని తెలిపారు. నాటి మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే ఈ ప్రాంతం నుండి పోటీ చేసిన రావి నారాయణరెడ్డి కే అత్యధిక ఓట్లు వచ్చాయని తెలిపారు. ఆ కమ్యూనిస్టు యోధుని బాటలో నడుస్తున్న ఎండి.జహంగీర్‌ను అదే విధంగా ఆదరించి ఓట్లు వేయాలని కోరారు.

రాజ్యాంగాన్ని మారుస్తానంటే ఊరుకునేది లేదు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి



రాజ్యాంగం మారుస్తానంటే ప్రజలు ఊరుకునేది లేదని స్పష్టంగా చెబుతున్నారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌కు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికి పంచుకున్న ఎండి.జహంగీర్ మూసి కాల్వ పక్షాన యాదాద్రి భువనగిరి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పాదయాత్రలు చేశారన్నారు. ఇండ్లు ఇండ్ల స్థలాలు విద్యుత్ చార్జీలు ఇతర సమస్యలు కమ్యూనిస్టులు పోరాట ఫలితంగానే తగ్గాయని సీపీఐ(ఎం) అభ్యర్థి తరపున ప్రచారం చేస్తుంటే ప్రజలు చెబుతూ ఆదరిస్తున్నారని తెలిపారు. సభలో నల్గొండ జిల్లా, సూర్యాపేట, రంగారెడ్డి ,జనగామ, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, కడిగళ్ల భాస్కర్, మోకు కనకారెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, పీఎస్ఎం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కట్టనర్సింహ, ఆనంద్ పాల్గొన్నారు.



















సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగర్ నామినేషన్ దృశ్యాలు







